# పంతాలూ పట్టింపులూ

సుబ్బారావుగారికి ఒక్కగానొక్క కూతురు ముద్దులపట్టి.ఎంతో గారాబంగా పెంచారు. తల్లి సుందరమ్మకి తన కూతురు యశోదకు మరెవ్వరికీ లేని అదృష్టాలన్నీ ఉండాలని కోరిక. అందుకే యశోదకు చదువు సంగీతం అందం ఆస్థి. తండ్రి పెద్ద ఉద్యోగంలో ఉండటంతో హోదాగా పెరిగింది.

పైగా మాటకారి. స్నేహితులతో ఎలా మాట్లాడాలో తల్లిదండ్రులతో ఎలా మాట్లాడాలో తెలిసిన జాణ.ఒకరకంగా కాలేజీలో రౌడీఅబ్బాయిలు కూడా యశోద జోలికి పోరు.ఆమె వస్తోందంటే ఎటో అటు వెళ్లిపోతారు పని ఉన్నట్టుగా.కొంతమంది లెక్చరర్లు కూడా 'ఏమమ్మా బాగున్నావా' అంటూ పలకరిస్తారు.

యశోదకి అన్ని మంచి గుణాలూ ఉన్నాయి.ఎటువంటి మొగుడు వస్తాడో! వాణ్ణి బుట్టలో పెట్టి అమ్మేస్తుంది అని మేనమామలు స్వతంత్రంగా జోక్ చేస్తారు.

"మీ తమ్ముళ్లు అని ఊరుకుంటున్నానమ్మా లేకపోతేనా.." అంటూ తల్లితో అంటుంది.

"బి.ఎ.పూర్తయినప్పుడు పెళ్లి ప్రయత్నాలు చేస్తుంటే, ఎం.ఎ. చదవాలన్నావు. సరే, ఎం.ఎ. పూర్తయింది కదా" అని తల్లి సుందరమ్మ కూతుర్ని ఒకరోజు నిలేసి అడిగింది.

"అమ్మా నాకు ఉద్యోగం చేయాలని వుంది." అని మారాం మొదలెట్టింది యశోద.

"నీకు ఉద్యోగం ఎందుకే హాయిగా ఇంటిపట్టున ఉండక?"

"అమ్మా నేను పుట్టినప్పటినుంచీ పెళ్లి పెళ్లి అని ఒక్కటే గొడవ. నేను అందరిలా డబ్బులు కోసం కాదు లోకం తెలియాలి.కూపస్థ మండూకంలా అయిపోతాను లేకపోతేను..."అంది. సరే, కూతురితో ఎంత వాదించినా ఇంతే అనుకుని ఊరుకుంది సుందరమ్మ.

యశోద ఆ రోజు ఫ్రెండు పుట్టినరోజు పార్టీ ఇస్తోందని హోటలు అశోకాలో అని తల్లితో చెప్పి బయలుదేరింది. చామంతి రంగు జార్జెట్ చీర, అదే కలరు జాకట్టు, ముత్యాలహారంతో అతి సింపుల్‌గా ముస్తాబయిన కూతుర్ని చూసి "పెళ్లి వద్దంటావు.నీ ముస్తాబు చూసినవాడు నిన్నువెగరేసుకుపోతాడు జాగ్రత్త" అని ఓ ఛలోక్తి విసిరింది తల్లి సుందరమ్మ.

ఆ మాటలు విన్న యశోద"ఆ.. పోదూ..నీ మాటలకి పొంగి పెళ్లికి ఒప్పేసుకోను."అంది

కొంటెగా నవ్వి.
"మరే వెళ్లండి."కూతుర్ని ముచ్చటగా చూస్తూ నవ్వుకుంది.
వెళ్లిపోయింది అనుకున్న యశోద వెనక్కి వచ్చి తల్లితో
"నాకు ఈపాతకాలపు పేరు పెట్టావేమిటే..నా ఫ్రెండ్స్ అస్తమానం అంటారు"అంది.
"వాళ్లున్నప్పుడల్లా నాతో గొడవపడుతూనేవుంటావు.కృష్ణుణ్ణి అల్లారుముద్దుగా పెంచిన సుందరాంగి. పోకిరీలందరూ గౌరవించు వనిత. నీకు ఎన్నిమార్లు చెప్పినా అర్ధంకాదేమిటే" అంది కోపంగా.
"ఏమైనా నా పేరు మార్చుకుంటాను చూడు."అని శపథం చేసి మరీ వెళ్లింది.
కారు వెళ్లినచప్పుడు విని, "హమ్మయ్య వెళ్లింది ఏం అల్లరి చేస్తుందో ఆ వచ్చే మొగుడు పడాలి దీనితో పాపం" అనుకుంది సుందరమ్మ.
"హల్లో యశోదా ఇప్పుడా రావడం?ఫంక్షన్‌కి అందరూ వచ్చి చాలా సేపయింది. కేక్ కోయడం కోసం నువ్వొస్తావని ఆగాం."అని ఎదురు వచ్చి మరీ పలకరించింది కోమలి.
"భలేదానివే అలా ఎందుకు చేసావు? చాలామంది వచ్చారు.నాకోసం ఆగడం ఏం బాగా లేదు."అంది యశోద.
"నీకేం గిఫ్ట్ కొనాలో అర్ధం కాలేదు.ఆఖరికి ఈ ఉంగరం తీసుకు వచ్చాను" అంది యశోద.
కోమలి కేక్ కోసాక, యశోద తను తెచ్చిన ఉంగరం కోమలి వేలికి తొడిగింది.
తను ఈ హాల్లోకి వచ్చినప్పటినుంచీ అందరి కళ్లూ తనమీదే వున్నాయి అనుకుంది.
దూరాన్నుంచి రెండు కళ్లు సుదీర్ఘంగా చూస్తున్నట్లు గ్రహించింది. హైటు, వెయిటూ కలరూ అతన్నిచూస్తూంటే బెంగాలీ బాబులాగా ఉన్నాడు అనుకుంది.
ఏమిటీ ఈ అమ్మాయి అందరిలోనూ హైటూ కలరూ చూడముచ్చటగా ఉంది.
ఇంతకీ పేరేమిటో?కోమలిని అడిగి తెలుసుకోవాలి అనుకున్నాడు అతను.
"ఈ బెంగాలీబాబుఎవరే?"అని కోమలిని అడిగేసింది మనసు ఆగక.
"రా..పరిచయం చేస్తాను" అంటూ అతని దగ్గరకు తీసుకువెళ్లింది.
"ఈమె నా ఫ్రెండు" అని పరిచయం చేస్తోంటే ఎవరో వచ్చి గిఫ్టు చేతిలో పెట్టి మాట్లాడుతున్నారు.
ఈ లోగా "మీ పేరు అడగవచ్చా?"అన్నాడు బెంగాలీబాబు.

"పేరు రేవతి"అంది యశోద.

అప్పుడే అక్కడికివచ్చిన లీల" నీపేరు రేవతి ఏమిటే యశోద కదా?"అంది.ఆ మాటలకు నవ్వుతూ తలతిప్పుకుంది యశోద.

"ఒరేయ్‌బాబూ! అబద్ధాలాడుతోందిరా!"అంది లీల.

"నాకు అబద్ధాలాడేవాళ్లంటే చాలా ఇష్టం"అన్నాడతను నవ్వుతూ.

యశోదకి ఎక్కడలేని కోపం వచ్చింది అతనిమీద. ముఖం ఎర్రగా కందగడ్డలా అయింది.

"మీరు కోపంలో చాల అందంగా ఉంటారండీ!"అన్నాడు.

"ఆ..ఇంతకీ ఈ పెద్దమనిషి ఎవరే?"అంది యశోద లీలతో.

"మా నాన్నగారిఫ్రెండు కొడుకు.చాలారోజులకువచ్చాడు. ఢిల్లీలో ఉంటాడు.ఐ.ఏ.యస్.అయి ప్రస్తుతం ఢిల్లీ సెక్రటేరియట్‌లో పనిచేస్తున్నాడు."అంది.

యశోదకి కోపం అంతా పోయి, చిరునవ్వు చిందిస్తూ

"చాలా గ్రేట్ అన్నమాట. మీ పేరు అడగొచ్చా?"అంది కొంటెగా చూస్తూ.

"నేను మీలా అబద్ధం చెప్పను.నాపేరు రాజశేఖర్."అన్నాడు.

"ఇటురండి ఇక్కడ కూచుని మాట్లాడుకుందాం."అంది యశోద-

తాను వెతుకుతున్న తన ఊహల్లోని ప్రియుడు దొరికినంత సంతోషం అయింది.

"నీతో ఇలా మాట్లాడుతోంది కాని చాలా గీర యశోదకి"అంది లీల.

"పోవే అతను ఏమనుకుంటాడు?"అంది క్రీగంట అతన్ని తనివితీరాచూస్తూను.

కొంటె చూపుల్ని ఆనందంగా రిసీవ్ చేసుకున్నాడు శేఖర్.

అంతా వెళ్లిపోయాక, "మీల్స్ అయిపోయింది కనుక ఒకసారి మీరు మా ఇంటికి వస్తారా?"అంది యశోద.

"అబ్బా ఇప్పుడా? మీ అమ్మ నాన్నగారు కబుర్లు మొదలెట్టారంటే రాత్రి పన్నెండు అవుతుంది. మీ పెద్ద ఇల్లు చూపించడంతో తెల్లారుతుంది.రేపువస్తా."అంది లీల.

శేఖర్‌కి మనసులో వెళ్లాలని ఉంది..యశోదతో ఇంకా కాసేపు ఉండవచ్చుని.

లీలకి,యశోద శేఖర్‌ని ఆకట్టుకుందని మనసు విలవిలలాడింది.

"సరే పద..వెడదాం"అంటూ శేఖర్‌కేసి చూసింది.

అతను అసలే అందగాడు.ఈమాటలకు అతని ముఖం చంద్రబింబమే అయింది.

యశోద కారు డ్రైవ్ చేస్తున్నా, మాట్లాడుతున్నా,ఎంతో పరిశీలనగా చూస్తున్నాడు శేఖర్.

లీల అది కనిపెట్టింది.ఇంక శేఖర్ తనకు దక్కడని భావించింది.అయినా ఏమవుతుందో వేచి చూద్దాం తనచేతికి బంగారు ఉంగరం బహుమతిగా ఇచ్చిందంటే ఎంతో ప్రేమ ఉంది కదా!నా ప్రేమికుణ్ణి తనుసొంతం చేసుకుందుకు ఎందుకు ట్రై చేస్తుంది? అనుకుంది.

శేఖర్ అని తల్లికీ తండ్రికీ అన్నివివరాలతో పరిచయం చేసింది యశోద.

పలకరింపులూ, కూల్‌డ్రింకులూ అయ్యాక"ఇంక వెడతాం"అంది లీల.

"అబ్బా అప్పుడేనా.మా ఇల్లు అంతా చూపించనీ"అంది.

ఇల్లంతా చూపిస్తుంటే,కావాలని యశోదని తాకాడు. మరోమారు చెయ్యి గట్టిగా నొక్కాడు.యశోద తను గమనించనట్టు ముఖం పెట్టి సీరియస్‌గా మాట్లాడేస్తోంది.

మెట్లు దిగి కారు దగ్గరకు వెళుతుంటే లీలని యశోదతల్లి వెనక్కు పిలిచి అతని అడ్రసు తీసుకుంది.

ఈలోగా శేఖర్ వెళ్లనా? అని కనుసన్నలతో అడుగుతూ,తనచేతి వేలుఉంగరం యశోద చేతివేలుకి తొడిగాడు.వద్దనలేదు యశోద. అది ఒక రసవద్ఘట్టంగా భావించింది.

ఇంతలోకే లీల వచ్చేటప్పటికి ఏమీ ఎరగనట్లు అయిపోయారు ఇద్దరూ.

హమ్మయ్య ఏం జరిగినట్లు లేదు అని మనసుని మభ్యపెట్టుకుంది లీల.

"రాత్రి పొద్దుపోయింది.నేను వచ్చి దిగబెడతాను"అంటూ యశోద తండ్రి డ్రైవింగ్ సీటు దగ్గర కూర్చున్నాడు.

జీవితంలో ఎప్పుడు ఏ అవకాశం వస్తుందో, అవాంతరం వస్తుందో తెలియదు.

ప్రతి ఆడపిల్ల జీవితంలోను పెళ్లి ఒక పెద్ద మలుపు.

శేఖర్‌ని తప్పమరెవర్నీ వివాహం ఆడను అని శపథం చేసింది యశోద.

అటు శేఖర్ కూడా అంత పట్టుదలగానూ ఉన్నాడు.

కొన్ని యశోద తల్లికి నచ్చనివి ఉన్నాయి. వాటిని యశోద తండ్రి సుబ్బారావుగారు పెద్ద విషయాలుగా పట్టించుకోలేదు.పైగా సుబ్బారావుగారు కూతురు వినకుండా ఒకమాట చెప్పారు సుందరమ్మకి.

"ఈ పెంకిపిల్ల అసలు పెళ్లికి ఒప్పుకుంది. లేకపోతే ఏ సంబంధం తెచ్చినా ఏవో కుంటిసాకులు చెప్పి విసిగిస్తోంది. ఏదో కృష్ణారామా అనుకుంటూ పుణ్యక్షేత్రాలు చూసివద్దాం" అన్నాడు. అయితేసరే అందావిడ.

ఒకరోజున లీలవచ్చింది.

"యశోద లేదా?"అని అడిగింది.

"ఏదో జాబ్‌కి ఇంటర్వ్యూకి వెళ్లింది.నీకు చెప్పలేదా?" అంది సుందరమ్మ. బేలగా ముఖం పెట్టి "చెప్పలేదు ఆంటీ! యశోద ఇదివరకులా నాతో ఎక్కువ మాట్లాడ్డం లేదు. ఏం దాచి ఉంచేది కాదు."అంది లీల.

"ఇంతకీ ఏంమాట దాచిందంటావు?"అని అడిగింది.

యశోద లేనప్పుడే అడిగి తెలుసుకోవాలనీ,"శేఖర్‌విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?"అంది నేల చూపులు చూస్తూ.

"ఆ..ఏముంది? యశోద అతనికి అదే శేఖర్‌కి నచ్చినట్లు తెలిసింది.యశోదకూడా సరేనంది."అంది సుందరమ్మగారు.

అతనికి తల్లిదండ్రులు లేరు. మానాన్నగారి స్నేహితుడి కొడుకు.నాకు అతనంటే మనసు.అతనికీను.కాని యశోదని చూసాక,నాకు ఫోన్ చెయ్యడంగాని లెటర్ రాయడంగాని మానేసాడు. అని చెబుదామని నోటిదాకా వచ్చి మనసంతా దిగులుగా బరువుగా అయిపోయి, "నేను వచ్చివెళ్లానని చెప్పండి యశోదతో"అని మెల్లిగా చేతి వేలినున్న ఉంగరం యశోద తనపుట్టినరోజకని ఇచ్చినది తీసి టీపాయ్‌మీద పెట్టి వెళ్లిపోయింది లీల.

అది ఎవరూ గమనించలేదు.యశోద సాయంకాలం వచ్చి టీ తాగుతూ "మనింటికి ఎవరేనా వచ్చారా?అంది.

"లీలవచ్చి వెళ్లింది"అని చెప్పింది సుందరమ్మ.

రాత్రి సుబ్బారావుగారు టీపాయ్‌మీద ఉంగరం చూసి యశోద మరచిపోయి ఉంటుందని అలమార్లో పెట్టారు.

లీల అనుకుంది వారం రోజులైనా యశోద ఫోన్ చెయ్యలేదు. నేను వదిలి వచ్చిన ఉంగరం తనిచ్చిందేనని తీసేసుకుందనుకుంది.

శేఖర్ అంగీకారం మీద పెళ్లి ప్రయత్నాలు జరుగుతున్నాయి.లీలకి ఫోన్‌లో చెప్పింది యశోద.

ఆ మాటలు అశనిపాతంలాగా తగిలాయి. తన ధనం ఎవరో దోచుకున్నట్లు తనని పాతాళానికి తోసినట్లు ఫీలయింది.

శేఖర్ కూడా అదే రోజున ఫోన్‌లో చెప్పాడు.
మాటలు రాక,మౌనంగా "అహా..అలాగా..నువ్వు అదృష్టవంతుడివి"అని పెట్టేసింది ఫోన్.
పెళ్లి పందిరి కళకళ్లాడిపోతోంది.యశోద అందాలరాశి.ఎంతో చూడ ముచ్చటగా ఉంది.రవ్వల నెక్లెస్, దుద్దులు, గాజులూ బెనరస్ తెల్ల పట్టు చీరలో పాలకడలినుంచి దిగి వచ్చిన లక్ష్మీదేవిలా వుంది.
అసలే అందగాడు.సఫారీ డ్రస్సులో, పెళ్లిబొట్టుతో చూడముచ్చటగా ఉన్నాడు శేఖర్.
లీల తల్లిదండ్రీ,పెళ్లి కొడుకువైపు పెళ్లిపెద్దలుగా వ్యవహరించారు.
లీల పెళ్లికి రాలేదు.తన బంధువులు ఎవరికో బాగా లేదని చూడ్డానికి వెళ్లిందని లీల తల్లిదండ్రీ సర్ది చెప్పారు.
యశోద లీల రాకపోయినందుకు ఏం బాధపడలేదు.
తనజీవితేశ్వరుణ్ణి అందరికీ చూపించింది.
"ఆరోజున లీల పుట్టినరోజున చూసాంకదా అంతా. లీల మాకుచెప్పిందిలే" అన్నారు.
అహా..అల్లాగా అంది. కానీ మరేం పట్టించుకోలేదు యశోద.
పూల మాలలతో పెళ్లి మంటపం శోభాయమానంగాఉంది.పెళ్లికి వచ్చిన పెద్దలంతా పెళ్లి కొడుకునీ యశోదనీ చూసి రతీమన్మధుల్లా ఉన్నారని పొగిడారు.
పెళ్లితంతు ప్రారంభమయింది.తాళి కట్టే సమయం వచ్చింది.ఆడపెళ్లివారుమంగళసూత్రం పట్టుకు వచ్చి ఇచ్చారు.
"మా ఇంటి ఆచారం పసుపు కొమ్ము కట్టడం.అన్నాడు పెళ్లికొడుకు శేఖర్.
అది చూసి యశోద తల్లి "ఇదేమిటి? ఇలాంటివి మాకు ఇష్టముండవు"అంది.
పెళ్లిమంటపంలో వాదోపవాదాలు వచ్చాయి. పెళ్లి ఆగిపోతుందేమోనని పురోహితులూ, పెద్దలూ నచ్చజెప్తే మంగళసూత్రానికి బదులుగా రెండోది పసుపుకొమ్ము కట్టాడు పెళ్లికొడుకు.
యశోద తల్లికేసి చూసింది.ఆమె పడుతున్న బాధకి కొంచెం కించపడింది.కళ్లతో వారించింది.వెంటనే శేఖర్‌కేసి కోరగా చూసింది.అతను అది గమనించనట్టు తల ఊప్పుకున్నాడు.
గులాబీల మాలలు వేసుకునేటప్పుడు అతనే నాకు ముందువేయాలంది.శేఖర్ ఒప్పుకోలేదు.

"సరే సరే అందరూ ఇటే చూస్తున్నారు కానీయండి" అని యశోద తండ్రి తొందర పెట్టాడు.
దాంతో యశోద గారాలు పోతూ శేఖర్ మెడలో వేసింది.
తలంబ్రాలు అప్పుడు కూడా పోటాపోటీయేగాని సరదాలేదు.వధూవరులను వచ్చినవారందరికీ పరిచయం చేసి, అల్లుడు ఐ.ఏ.యస్.అని ఆనందంతో మురిసిపోయాడు సుబ్బారావుగారు.
విందు భోజనాలు అయ్యాక ఎక్కడి వారక్కడికి పెళ్లికబుర్లు చెప్పుకుంటూ వెళ్లిపోయారు.
శేఖర్ ఆమర్నాడు మావగారి దగ్గరకి వచ్చి "మేము ఒకసారి మద్రాసు స్టేట్ వెళ్లిరావాలి."అన్నాడు.
"అక్కడ ఎవరున్నారు?యశోద ఎందుకు?"అన్నారు.
"మేము వెళ్లి రావాలి.తర్వాత చెప్తాను సంగతులు."అంటూ అల్లుడి అధికారంతో అన్నాడు.
ఇంకా గట్టిగా అడిగితే బాగుండదని ఆయన ఊరుకున్నారు.
యశోదకి అసలు ఇష్టం లేదు.పెళ్లిలో పసుపుకొమ్ము కట్టినందుకు...తల్లి బాధ పడిందని..."నాకురావాలనిలేదు"అంది.
"కొన్ని నాయిష్ట ప్రకారం జరగాలి"అన్నాడు శేఖర్ అహంకారంతో.
తప్పనిసరి అని బయలుదేరి వెళ్లింది యశోద.
మద్రాస్ సెంట్రల్ స్టేషన్‌లో ట్రైన్ దిగేటప్పటికి కారు వచ్చి వుంది.కారెక్కి వెళ్లారు.
"అబ్బా ఎంత దూరం"అంది.
"వచ్చేసాం"అంటూంటే ఒక పల్లెటూరు వెళ్లి ఆగింది కారు.
ఒక ఆశ్రమం. అక్కడ కాషాయి బట్టలు కట్టుకున్న ముసలి ఆయన, పండినగడ్డంతో, చేత్తో తావళం తిప్పుతున్నాడు. చుట్టూ నిరుపేదలు భజన చేస్తున్నారు.
ఆయనకాళ్లకి దణ్ణం పెట్టమన్నాడు శేఖర్.
"నేను ఈ వృద్ధుని కాళ్లకి దణ్ణం పెట్టను'అంది యశోద.
"ఎందుకు పెట్టవు?"అని కోపంగా అరిచాడు శేఖర్.
యశోద మౌనంగా నిర్లక్ష్యంగా కోరగా చూసి విసవిసా వెళ్లి కార్లో కూర్చుంది.
"పోనీలే నాయనా! నువ్వు వచ్చావు కదా!"అంటూ ఆప్యాయంగా తలనిమిరి, కాళ్లకి

దణ్ణం పెడుతూంటే ఆశీర్వదించాడాయన.
"మీరు ఏమిటో ఎంతటివారో తెలుసుకోలేకపోతోంది.ఎలా చెప్పాలో నాకు తెలియడం లేదు"అన్నాడు శేఖర్.
"సరేలే నీకుఇష్టమైనఅమ్మాయిని చేసుకున్నావు కదా! సంతోషంగా ఉండు.ఇలాంటివి మరిచిపో"అన్నాడాయన.
శేఖర్‌కి ఆయన మాటలు నచ్చాయి గాని అహం అడ్డు వచ్చింది. సరే వెళ్లొస్తాను అని ఆయన దగ్గర సెలవు తీసుకుని వచ్చి కార్లో కూర్చుని యశోదతో అన్నాడు."నీ ప్రవర్తన నాకు నచ్చలేదు."
"నాకూ నచ్చలేదు మీ ప్రవర్తన"అంది యశోద.
శేఖర్ కోపంగా చూసి "నిర్లక్ష్యంగా మాట్లాడకు. కొన్ని కనీస గౌరవాలు నేర్చుకో"అన్నాడు.
"కొత్తగా నేర్చుకోవలసిన స్థితిలో నేను లేను."అంది.
శేఖర్ యశోదచేతికి ఏ.సి.టిక్కెట్టు ఇచ్చి "వెళ్లు మీ ఇంటికి..నేను తర్వాత వస్తాను"అని చెప్పి ట్రెయిన్ కదలగానే వెళ్లిపోయాడు.
యశోదకి అతని ప్రవర్తనమీద చాలా అసహ్యం వేసింది.
ఇతన్ని తల్లిదండ్రులు ఇంత అహంకారంతో పెంచారనుకోలేదు.ఛీ..ఎరక్కపోయి ప్రేమించాను ఇతన్ని. అందమైన నా జీవితంలో అడ్డుపుల్లలా తయారయ్యాడు అనుకుని ఇంటికి చేరింది చేసేదిలేక.
తల్లిదండ్రులకు జరిగిందంతా చెప్పింది.పెళ్లయిన మొదటిరోజునే ఇంత దెబ్బలాడుకుంటే వీళ్ల కాపురం ఎలా నడుస్తుంది అని భయపడ్డారు వాళ్లు.
నెల అయింది. రెండు నెలలు అయ్యాయి.శేఖర్‌దగ్గరనుండి ఫోన్ గాని ఉత్తరంగాని రాలేదు. ఏంచెయ్యాలో సుబ్బారావుగారికీ సుందరమ్మకీ అర్థంకావడం లేదు.
యశోద మాత్రం ఏదో దిగులుగా ఉన్నట్లు కనిపెట్టారు.
ఒకరోజున యశోదని కూర్చోబెట్టి అడిగారు,ఈ పరిస్థితిలో మనం ఊరుకుంటే బాగుండదు అని.
"అయితే ఏమంటారు?"విసుగ్గా అంది యశోద.
"మనమే అతనికి ఫోన్ చేసి ఒకసారి రమ్మని చెబుదాం."అన్నారు.

"ఆయనగారు రారు."అంది యశోద.

"ఎప్పుడూ ఒకటే పట్టుదల..చిన్నప్పటినుంచి చూస్తున్నాము. ఆఖరికి కాపురం కూడా పోతున్నా నీ పట్టుదల మారటం లేదు"అని గట్టిగా అరిచారు సుబ్బారావుగారు.

"అయితే ఇప్పుడు నన్నేం చేయమంటారు?"అంది.

"ఏమైనా నువ్వు అతని దగ్గరకు వెళ్లడమే మంచిది."

"అలా వెడితే లోకువ అయిపోతాను."

"తప్పుగా ఆలోచిస్తున్నావు.వెడితే నీమీద ప్రేమ వస్తుందమ్మా!"

"మీరు ఎప్పుడూ ఇంతే.ఎప్పుడూ మీ పురుషుల ఆధిక్యతకే సరిపోతోంది మా ఆడవాళ్ల జీవితం."

"అసలు నీ పట్టుదల, కోపమే నీ కూతురికీ వచ్చాయి.నన్నుపెళ్లయిన కొత్తలో ఎలా ఏడిపించేసావు?"అన్నారు సుబ్బారావుగారు.

దాంతో తల్లీ కూతురూ నోరెత్తలేదు.

"పద.రేపే నిన్ను ఢిల్లీ తీసుకువెళ్లి అతని దగ్గర దిగబెట్టి వస్తాను"అని సింహగర్జనలా చెప్పాడు సుబ్బారావుగారు.

"పద అమ్మా! ఆడపిల్ల పెళ్లయినాక భర్తతో మంచిగా ఉంటూ అతని ఆనందమే నీఆనందంగా చూసుకో అమ్మా"అని చెప్పి కణ్వ మహర్షి శకుంతలను దుష్యంతుడి దగ్గరకి చేర్చిన ఉదంతం తలుచుకుంటూ,"యశోదని తీసుకుని రేపే ఢిల్లీ వస్తున్నాను" అని ఫోన్‌లో చెప్పి ఫ్లయిట్ నెంబరు, టైమూ చెప్పారు అల్లుడికి.

"నాన్నా"అంది బేలగా.

"అతను చాలా మంచివాడమ్మా ఎయిర్‌పోర్ట్‌కి కారు తీసుకుని వస్తాడు చూడు. మనిషిలో ఉన్న మంచితనాన్ని పెంచాలి..నమ్మాలి.."అన్నారు.

నిజంగానే ఎయిర్‌పోర్ట్‌కి రాజశేఖర్ కారు తీసుకు వచ్చాడు. మావగారినీ యశోదనీ నవ్వుతూ పలకరించాడు.

యశోద ఇతనిలో మంచితనం ఇంత వుందా.కోపాన్నే చూసాను ఇన్నాళ్లూ-అనుకుని అతనికేసి సానునయంగా చూసి చిరునవ్వు నవ్వింది.

శేఖర్ ఆ నవ్వుకి ఆనందపడ్డాడు.

పంతాలు పట్టింపులకీ పోకుండా,నలుగురూ మనల్ని చూసి నవ్వకుండా గుట్టుగా

కాపురం చేసుకోండి అని సుబ్బారావుగారు యశోదని అతని చేతిలో పెట్టి- "కాపురంలో కలతలు రాకుండా తొందరలో ఒక మనవడ్ని ఇస్తే నేనూ మీ అమ్మా ఆనందిస్తాం"అన్నారు తిరిగి వచ్చేస్తూను...

❄❄❄

(రేడియో 2002)